సాక్షి
ప్రకాశం

గురువారం । 11 । మే । 2023





**అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం**

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశానికి బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు గైర్హాజరుపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో..



**భక్త పరవశం**

పీసీపల్లి మండలం వెంగళాపురంలో నాలుగు రోజులుగా వైభవంగా సాగుతున్న గంగమ్మ జాతర బుధవారం పొంగళ్ల సమర్పణతో ముగిసింది. - 8లో..

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 38 /27

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

## న్యూస్‌రీల్

### ప్రశాంతంగా పాలిసెట్



పాలిసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు:** పాలిసెట్ పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఒంగోలులో 9 సెంటర్లు, మార్కాపురంలో 3 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. మొత్తం 4,756 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 581 మంది గైర్హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ శివప్రసాద్ తెలిపారు.

**ఒంగోలు అర్బన్:** పాలిసెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఏ పాలిటెక్నిక్ కాలేజిలో జరుగుతున్న పాలిసెట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా కో ఆర్డినేటర్, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్, నెల్లూరు జిల్లా పర్యవేక్షకుడు సుధాకర్‌రావు తదితరులు ఉన్నారు.

### రేపు క్రీడా సంఘాల అత్యవసర సమావేశం

**ఒంగోలు:** జిల్లాలోని ఒలంపిక్ అసోసియేషన్ అనుబంధ క్రీడా సంఘాల అత్యవసర సమావేశం ఈ నెల 12న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కర రావు, బొడ్డు సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం స్టెప్ సీఈఓ, చీఫ్ కోచ్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తప్పక హాజరుకావాలన్నారు.



పీసీపల్లి మండలం నేరేడుపల్లి పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థులతో హనుమంతునిపాడు చిన్నముప్పాళ్లపాడు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

# సర్కారు బడి.. పదిలో మెరిసి..!

ఉత్తమ ఫలితాలు సాధించాలన్న విద్యార్థుల సంకల్పం.. ఉపాధ్యాయుల అంకితభావం వెరసి పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అదరగొట్టారు. జిల్లాలోని తొమ్మిది పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. ముందస్తు ప్రణాళికతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మెరిశారు. ప్రభుత్వ స్కూళ్లంటే చిన్న చూపొద్దు అనేలా మార్కులు సాధించి సత్తాచాటారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సూచనలతో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు చదువులో ముందున్న వారు మరింతగా రాణించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డీఈవో పి.రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక మెటీరియల్ కూడా రూపొందించి విద్యార్థులకు అందించారు.

- అంకితభావం.. చిత్తశుద్ధి
- తొమ్మిది పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత
- అధికశాతం ఫస్ట్‌క్లాస్‌లే
- తల్లిదండ్రులతో నిరంతర సమీక్ష
- విద్యార్థులకు ప్రతిరోజూ పరీక్షల నిర్వహణ
- ప్రత్యేక తరగతులు
- పరీక్షల భయం పోగొట్టేలా కౌన్సెలింగ్

**ఒంగోలు/హనుమంతునిపాడు/పీసీ పల్లి:** జిల్లాలో రెండు విద్యాశాఖ డివిజన్‌లు ఉన్నాయి. ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి పరిధిలో 141 ఉన్నత పాఠశాలలు, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి పరిధిలో 167 పాఠశాలలు ఉన్నాయి. మొత్తంగా 6,919 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 35 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. అందులో అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్, సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్ (బాలురు), ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలికలు (కొండపి), ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల (పొన్నలూరు), కేజీబీవీ (మోటుమాల), మహాత్మాజ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (టంగుటూరు), చిన్నం ఉప్పలపాడు జెడ్పీ హైస్కూలు, నేరేడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, పెదగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి. అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాలలో 75 మంది, సంతనూతలపాడు బాలుర గురుకుల పాఠశాలలో 74 మంది, కొండపి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 77, పొన్నలూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడుగురు పదో తరగతి పరీక్షలు రాశారు. కొత్తపట్నం మండలం మోటుమాల కేజీబీవీలో 31 మంది, టంగుటూరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలో 17 మంది, చిన్నం ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలలో 20 మంది, నేరేడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 29 మంది, పెదగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10 మంది పరీక్షలకు హాజరవగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.

### ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ...

పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలనే ఆశయంతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అందులో భాగంగా విద్యార్థులకు భారం కాకూడదనే ఉద్దేశంతో మధ్యాహ్నం టిఫిన్ ఏర్పాటు, సెలవు రోజుల్లో స్టడీ అవర్‌లో మజ్జిగ, చిరుతిళ్లు వంటివి ఏర్పాటుచేస్తూ వారిలో పాఠశాల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టారు. పరీక్షల్లో ఎలా రాస్తే మార్కులు వస్తాయి, జవాబులు రాసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చదువులో వెనుకబడిన విద్యార్థులు పాసయ్యేందుకు సబ్జెక్టును ఎలా ప్రిపేరవ్వాలనే అనేక అంశాలపై ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలు ఫలించాయి. ప్రతి పాఠశాలలో వందకు వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు సూచనలు చేయడం జరిగిందని డీఈవో పి.రమేష్ తెలిపారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు అందరూ కష్టపడ్డారని, అయితే 9 పాఠశాలలు వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించిన దృష్ట్యా వారు ఇంకా ఎటువంటి మెరుగైన అంశాలను పాటించారో.. ప్రస్తుత ఫలితాలను పరిశీలించి రాబోయే విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో సైతం నిరంతరం సమీక్షించి పరిస్థితిని వివరించేవారమని తెలిపారు. వందశాతం ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులకు డీఈవో అభినందనలు తెలిపారు.

### అందరి సహకారాలతో...

పీసీ పల్లి మండల పరిధిలోని నేరేడుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 29 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, అందరూ పాసయ్యారు. హెచ్‌ఎం రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తూ.చ.తప్పకుండా పాటిస్తున్నామని, ప్రతి 15 రోజులకోసారి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఆ 15 రోజులకు సంబంధించి విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తామన్నారు. అంతేగాకుండా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లు పెడుతున్నామని, గ్రామస్తులు, ఉపాధ్యాయుల సహాయ సహకారాలు ఉండటంతో తాము విద్యార్థులకు మంచి బోధన అందిస్తున్నామన్నారు.

**టాప్‌లో మూడు పాఠశాలలు**



హనుమంతునిపాడు మండలంలోని చిన్న ముప్పాళ్లపాడు, పెద్దగొల్లపల్లి, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులు 10వ తరగత పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చేశాం. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి చదివించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ ఉంచి చదివించడంతో పాటు నూరు శాతం ఫలితాలు సాధ్యమయ్యాయి.

– జి.పెద్దిరాజు, ఎంఈఓ, హనుమంతునిపాడు

### 15 ఫస్ట్‌క్లాస్‌లు...

10వ తరగతి పరీక్ష ఫలితాల్లో హనుమంతునిపాడు మండలం చిన్నముప్పాళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 20 విద్యార్థులకుగానూ అందరూ పాసయ్యారు. వారిలో 15 మంది ఫస్ట్ క్లాస్, నలుగురు సెకండ్ క్లాస్, ఒకరు థర్డ్ క్లాస్ సాధించారు. వారిలో ముక్కు వీర్రాజు 532 మార్కులు సాధించాడు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రతిరోజూ సబ్జెక్టు ఉపాధ్యాయులు టెస్టు నిర్వహించారు, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించారు.

### విద్యార్థుల పట్టుదల...

హనుమంతునిపాడులోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 34 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, నూరు శాతం ఫలితాలు సాధించారు. వి.ప్రవలిక 565 మార్కులు సాధించగా, 32 మంది ఫస్ట్ క్లాస్, ఒకరు సెకండ్ క్లాస్, ఒకరు థర్డ్ క్లాస్ సాధించారు. కేజీబీవీలో ఉపాధ్యాయుల కొరత లేదు. ప్రత్యేక శ్రద్ధ, విద్యార్థుల పట్టుదలతో నూరు శాతం ఫలితాలు వచ్చాయని ఎస్‌వో సుశీల తెలిపారు.

### పదికి పది పాస్...

పెద్దగొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. వారిలో 9 మంది ఫస్ట్ క్లాస్, ఒకరు సెకండ్ క్లాస్ సాధించారని హెచ్‌ఎం షేక్ ముంతాజ్ బేగం తెలిపారు.



హెచ్‌ఎం పాడు కస్తూరిబా బాలికల పాఠశాల

**ప్రత్యేక క్లాసులతో 565 మార్కులు**



మా పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత లేదు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాస్‌లు పెట్టి చదివిస్తారు. చదివించిన వాటిపై పరీక్ష రాయిస్తారు. ప్రతి సబ్జెక్టు టీచర్ క్రమశిక్షణతో బోధించడంతో పాటు మంచి సూచనలు, సలహాలు ఇవ్వడంతో మాకు మంచి మార్కులు సాధించాను. నాకు 565 మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది.

– వి.ప్రవలిక, కేజీబీవీ విద్యార్థిని

# జగన్‌తోనే సామాజిక న్యాయం

- యాదవులను గుర్తించిన నాయకుడు వైఎస్ జగన్
- ఎంపీ బీదా మస్తాన్‌రావు
- కాటంరాజు అందరివాడు: ఎమ్మెల్యే బుర్రా



కాటంరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

**కనిగిరి రూరల్:** బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల కలలను సాకారం చేసిన గొప్ప నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు అన్నారు. పీసీపల్లి మండలంలోని వెంగళాపురంలోని పాలేటి గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం కాటంరాజు విగ్రహావిష్కరణ అనంతరం పెన్నా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. యదు వంశ పితామహుడు కాటం రాజు అయితే యాదవులను గుర్తించిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను కరివేపాకులా వాడుకున్నారని తీవ్రంగా మండి పడ్డారు. గుండె ధైర్యం, ఖలేజా ఉన్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, మాట ఇస్తే తప్పరన్నారు. పేదల ఆకలి తీరాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలన్నారు. 9 మంది రాజ్యసభ సభ్యుల్లో నలుగురు బీసీలను ఎంపీలుగా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్లే ఎంతో మంది బీసీ వర్గాల ప్రజలు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి మించిన తనయుడిగా అనేక విద్యా పథకాలు చేపట్టారన్నారు. రానున్న రోజుల్లో 50 శాతం స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తారన్నారు. కనిగిరిలో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని బీదా మస్తాన్‌రావు అన్నారు. ఇక్కడ నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్ తిరిగి ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు. కనిగిరిలో కాటంరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసి దేశంలోనే ఆదర్శంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నిలిచారన్నారు.

**జగన్ పాలనలో పేదల కళ్లల్లో వెలుగులు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే వెనుకబడిన పేదవర్గాల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయని మాజీ మంత్రి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. యాదవులకు న్యాయం చేసేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. తిరుమల సన్నిధి గొల్లను సన్నిధి యాదవ్‌గా పేరు మార్చడమే కాక, సన్నిధి యాదవ్‌కి వంశపారపర్యంగా మార్చి యదు వంశ కీర్తిని తరతరాలుగా గుర్తుండేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. కాటంరాజు స్ఫూర్తితో యాదవ జాతి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కనిగిరిలో కాటంరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బీసీ వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలబడి తిరిగి సీఎంను చేసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు.

ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కాటంరాజు అందరి వాడన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాటంరాజు విగ్రహాన్ని అందరి సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాడు కాటంరాజు పాలనలో రాజ్యం ఎంతో మేలు జరిగిందని, నేడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. నలభై ఏళ్లుగా ఎస్ గొల్లపల్లి చెరువు నిండలేదని, గత నాలుగేళ్లుగా నీళ్లు పుష్కలంగా పారుతున్నాయన్నారు. సభలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కాటం అరుణమ్మ, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, రామకృష్ణా స్వామి, రాష్ట్ర డైరక్టర్, యాదవ సంఘ అధ్యక్షుడు పెన్నా వెంకటేశ్వర్లు మాట్లాడారు. తొలుత యాదవులు బొల్లావులు, కొమ్ములతో నేతలకు స్వాగతం పలికారు. అనంతరం అభయాంజనేయ స్వామి, గంగమ్మ తల్లికి విశిష్ట పూజలు చేసి కాటంరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న ఎంపీ బీదా మస్తాన్‌రావు, వేదికపై ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, కొలుసు పార్థసారథి, యాదవ సంఘ నేతలు

# ఫిర్యాదులు గడువు లోగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

**ఒంగోలు:** జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఎస్పీ మలికాగర్గ్ జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన 1902 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఏ పోలీసుస్టేషన్ పరిధిలోనైనా ఫిర్యాదులు అందిన వెంటనే ఆ ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పూర్తి స్థాయిలో విచారించి నిర్ణీత సమయం లోగా బాధితులకు న్యాయం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లోని డాష్‌బోర్డులో చెక్ చేస్తూ పెండింగ్ లేకుండా ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లు ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ప్రదేశానికి ప్రత్యక్షంగా హాజరై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని, బాధితులకు న్యాయం చేసి సంతోషపరచాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను తాను ప్రత్యేకంగా పరిశీలిస్తానని, ఫిర్యాదిదారులకు ఫోన్‌చేసి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటానని తెలిపారు. సివిల్ వివాదాల విషయంలో రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌లో నమోదుచేస్తూ సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురాన, అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్‌వీ శ్రీధరరావు, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ బీ.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## గిరిజన కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ ప్రతిభా కళాశాల(పీటీజీ, బాలురు)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాజేంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని వివరించారు. 2023 ఏప్రిల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్టీ(పీటీజీ) విద్యార్థులు ప్రవేశానికి అర్హులని, ప్రతి గ్రూపులో ఓసీకి ఒకటి, బీసీకి ఒకటి, ఎస్సీకి ఒక సీటు కేటాయించామని తెలిపారు. పీటీజీ(చెంచు) విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, మిగిలిన సీట్లను ఇతర ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 31వ తేదీలోగా www.aptwgurukulam.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అందుబాటులో టీఎంఆర్ దాణా

ఒంగోలు సబర్బన్: అత్యంత పోషక విలువలు గల టీఎంఆర్(టోటల్ మిక్స్‌డ్ రేషన్) దాణాను అవసరమైన రైతులందరికీ పంపిణీ చేయడానికి సరిపడా అందుబాటులో ఉందని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకుగాను జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో దాణా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని ఆర్బీకేల ద్వారా 1,644 టన్నుల టీఎంఆర్ దాణాను 60 శాతం రాయితీపై పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వేసవి ముగిసేలోగా రైతులందరికీ పంపిణీ చేసేందుకు వీలుగా మరో 600 టన్నుల దాణా జిల్లాకు కేటాయించినట్లు వెల్లడించారు. దాణా ఎమ్మార్పీ ధర కేజీ రూ.15.90 కాగా రైతు కేవలం రూ.6.50 చెల్లిస్తే సరిపోతుందని, ఒక రైతు ఒకేసారి 1,800 కేజీల వరకు దాణా పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు.



- గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు
- పొంగళ్ల సమర్పణతో ముగిసిన ఉత్సవం

# భక్త పరవశం



అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న భక్తులు

పీసీపల్లి: డప్పుల మోతలు.. కొమ్ముబూర శబ్దాలతో పాలేరు పరిసరాలు మారుమోగాయి. వీరాతాళ్లతో బొల్లావులనెత్తుకుని చిందులు తొక్కుతూ గంగమ్మ సన్నిధికి చేరుకున్న భక్త సమూహాలు తమ ఇంటి ఇలవేల్పునకు భక్తితో పూజలు నిర్వహించాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పీసీపల్లి మండలం వెంగళాపురంలో నాలుగు రోజులుగా వైభవంగా సాగుతున్న గంగమ్మ జాతర బుధవారం పొంగళ్ల సమర్పణతో ముగిసింది. చివరి రోజు కావడంతో వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. చెల్లుబాటు కోసం బొల్లావులకు ముద్రలు వేయించుకున్నారు.



పాలేటి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



ముద్రల కోసం సిద్ధంగా ఉంచిన బొల్లావులు

## అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- సంజాయిషీ కోరాలని సీఈఓకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశానికి బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు గైర్హాజరు కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి మాట్లాడుతూ జెడ్పీ నిధుల నుంచి మంజూరై పూర్తి చేసిన పనులకు బిల్లులు ఎందుకు పంపడం లేదో వివరణ కావాలని పట్టుబట్టారు. దీనికి వివరణ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు సమావేశంలో లేకపోవడంపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారుల నుంచి వెంటనే సంజాయిషీ కోరాలని జెడ్పీ సీఈఓ జాలిరెడ్డిని ఆదేశించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ జూలైలో నీరు ఇచ్చేందుకు షెడ్యూల్ ఏమైనా ప్రకటించారా లేదా తెలపాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం నీరు వదిలితే ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖాధికారులు సంయుక్తంగా పనిచేయాలన్నారు. జగనన్న ఇళ్ల స్థల కేటాయింపులో హౌసింగ్ శాఖాధికారులు దృష్టి సారించాలని సూచించారు. చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ జలసిరి బోర్లు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినా ఎందుకు మంజూరు చేయలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు ఉమ్మడిగా ఇవ్వడం వల్ల సమస్యలు వస్తున్నాయని, వాటిని వ్యక్తిగతంగా రాయితీపై ఇవ్వాలని కోరారు. పుల్లలచెరువు జెడ్పీటీసీ మాట్లాడుతూ విత్తనాలు సకాలంలో అందించాలని, పత్తి విత్తనాలకు రాయితీ ఇవ్వాలన్నారు. త్రిపురాంతకం జెడ్పీటీసీ మాట్లాడుతూ బీమా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లింగసముద్రం జెడ్పీటీసీ మాట్లాడుతూ రాళ్లపాడు, చిన్నపవని ఎస్సీ, ఎస్టీ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ సమీక్ష సమావేశాలకు జెడ్పీటీసీ సభ్యులను పిలవకుండా ప్రోటోకాల్ పాటించకుండా ప్రైవేట్ వ్యక్తులతో ప్రారంభం చేయించిన సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పీడీని ఆదేశించారు. మొత్తం ఏడు సంఘాల సమావేశాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రతి విషయానికి యాక్షన్ టేకెన్ రిపోర్టు తయారుచేసి అధికారులు పంపాలని, అధ్యక్షుల ఆదేశాల మేరకు ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.